ఫిబ్రవరి 5, 6న ఎస్సీ వర్గీకరణ అమలు కోసం దీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

ముషీరాబాద్: భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ పై ఇచ్చిన తీర్పును రాష్ట్రంలో వెంటనే అమలు చేయాలని లేకుంటే ఫిబ్రవరి 5, 6న రాష్ట్ర వ్యాప్తంగా 48 గంటల దీక్ష చేపడుతామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యానగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చేసుకునే హక్కును రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని చెప్పిన సూచన ప్రకారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదే రోజు నిండు అసెంబ్లీ సాక్షిగా ఎస్సీ వర్గీకరణ చేసే మొదటి రాష్ట్రం తెలంగాణగా నిలుస్తుందని చెప్పారన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు పెట్టి వర్గీకణ చేయాలని లేదంటే జనవరి 20వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామన్నారు. ఫిబ్రవరి 5, 6వ తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా 48 గంటలు దీక్షలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో చిలకమారి గణేష రమేష్, శ్రీనివాస్, బి.శ్రీనివాస్, నర్సింహ్మా, యకయ్య, అంజన్న, సంజీవ, హుస్సేన్, యాదగిరి, లక్ష్మమ్మ, శాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్ కుమార్, ఎమ్మెల్సీ దయానంద్

చిక్కడపల్లి: మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు జన్మదినం సందర్భంగా మైనంపల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. శుక్రవారం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పేదలు, దివ్యాంగుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేశారు. అనంతరం గాంధీ ఆస్పత్రి వద్ద రోగుల సహాయకులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సేవా కార్యక్రమాలు నిర్వహించడమే తమ ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, ట్రస్ట్ చైర్మన్ బద్దం మోహన్ రెడ్డి నేతలు పాశం అనిల్‌యాదవ్, జగదీశ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, బాబురావు, బాబ్జీ, సురేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



చిక్కడపల్లి: తెలంగాణ కల్చరల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శుక్రవారం రాత్రి త్యాగరాయ గాన సభలో నిర్వహించిన తెలుగు, హిందీ, సినీ సంగీత విభావరి అలరించింది. గాయని గాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. అనంతరం జరిగిన సమావేశంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొల్లేటి దామోదర్ గుప్తా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త జి.మల్లేష్‌కు సేవా రత్న, ప్రముఖులు పార్వతి, ప్రమీల, ప్రతిభకు మహిళా రత్న పురస్కారాలను ఆయన ప్రదానం చేశారు. కార్యక్రమంలో నవరస గాయని ఆమని, గాయకులు చంద్రశేఖర్, సుభాష్, రాజన్ తదితరులు పాల్గొన్నారు.

భరత్‌కు అభినందనలు

ముషీరాబాద్: విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ బీజెడ్‌సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎల్.భరత్ అనే విద్యార్థి జనవరి 15 నుంచి 21 వరకు గుల్బర్గా యూనివర్సిటీలో జరిగే ఎస్ఎస్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌కు ఎంపికయ్యారు. శుక్రవారం ఎంపికైన విద్యార్థి భరత్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ కె.ప్రభు, టీజీసీటీఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఈ.బ్రిజేష్, అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపల్ లావణ్య, ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఓ.పద్మజ, ఇతర బోధన సిబ్బంది అభినందనలు తెలియజేశారు.



భరత్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక బృందం

వైకుంఠ ఏకాదశి.. భక్తిశ్రద్ధలతో పూజించి.!

నగరంలో ప్రతిష్టాత్మకమైన చిక్కడపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా చిక్కడపల్లి ఏసీపీ రమేష్ పోలీసు బందోబస్తు నిర్వహించారు. తీర్థప్రసాద వితరణకు భక్తుల కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఆర్టీసీ క్రాస్ రోడ్డు నుంచి ఆలయం వరకు భారీ క్యూలైన్ కనిపించింది.

– సుందరయ్యవిజ్ఞానకేంద్రం





చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి వద్ద క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు, పర్యవేక్షిస్తున్న ఆలయ ఈవో అన్నపూర్ణ, ఏసీపీ రమేష్

ఆధ్యాత్మిక శోభ

ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులతో పోటెత్తిన దేవాలయాలు

భక్తులకు వైకుంఠ ద్వార దర్శన భాగ్యం కల్పించిన ఆలయ నిర్వాహకులు

ముక్కోటి ఏకాదశిని వైకుంఠ ఏకాదశి పర్వదినంగా ఏటా మార్గశిర మాస శుక్లపక్ష ఏకాదశిగా జరుపుకుంటారు. దక్షిణాయణ ప్రారంభమే ముక్కోటి ఏకాదశి అని అర్చక స్వాములు తెలిపారు. మహా విష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైన దినాల్లో ముక్కోటి ఏకాదశి ఎంతో ముఖ్యమైనదిగా హిందువులు భావిస్తారన్నారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లోని దేవాలయాలు భక్తులతో పోటెత్తాయి. శుక్రవారం వేకువజాము నుంచే భక్తులు పోటెత్తారు. నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయం పరిసరాల్లో ఉత్సవ మూర్తులను రథంపై ఊరేగించారు.

– అంబర్‌పేట, ముషీరాబాద్ జోన్ బృందం



చే నంబర్ చౌరస్తాలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే వెంకటేష్ దంపతులు



రాధాకృష్ణులకు పుష్పార్చన కావిస్తున్న వేదపండితులు



అంబర్‌పేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బీఆర్‌ఎస్ సీనియర్ నేత వెంకట్‌రెడ్డి



లక్ష్మీగణపతి ఆలయంలో జరిగిన పూజల్లో వేదపండితులు, భక్తులు



వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు



నల్లకుంట పురవీధుల్లో రథంపై ఊరేగుతూ వచ్చిన స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు



ఓయూ ఏసీపీ జగన్, నల్లకుంట ఎస్‌హెచ్‌ఓ జగదీశ్వర్‌రావులను ఆశీర్వదిస్తున్న వేదపండితులు



రాధాకృష్ణులకు పుష్పార్చన కావిస్తున్న వేదపండితులు







చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్ దంపతులు, కార్పొరేటర్ రవిచారి, బీఆర్‌ఎస్ నేత ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి



రజక వృత్తిదారుల సంఘం సదస్సులో మాట్లాడుతున్న పి. ఆశయ్య

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అందులో భాగంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రజక వృత్తిదారుల సంఘం రెండో రోజు జరిగిన వృత్తి శిక్షణ ఉపాధి కల్పన సదస్సు ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆశయ్య మాట్లాడుతూ... వృత్తిలో ఆధునీకరణ ఉపాధి కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. యాంత్రికరణ లాండ్రీ ప్రతి జిల్లాకు రూ.10కోట్లతో ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. డ్రైక్లీనింగ్ షాపు ఏర్పాటుకు యువతకు 10లక్షల వరకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గుమ్మడిరాజు నరేష్, ఎం. బాలకృష్ణ, మల్లేష్, గోపాల్, జ్యోతి, ఉపెందర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



అంబేద్కర్ కళాశాలలో క్రీడోత్సవాలను ప్రారంభిస్తున్న పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ అన్నారు. శుక్రవారం అంబేద్కర్ కళాశాలలో స్పోర్ట్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడలను ప్రారంభించిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ... బాల్యంలో ఆటలు అనేవి చాలా ముఖ్యమైనవని చదువుతోపాటు ఆటపాటల్లో కూడా రాణించాలని ఆయన సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని నింపుతాయని పేర్కొన్నారు. గెలుపోటములు సహజమేనని అవి తమ జీవితాలకు కూడా అన్వయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లతో పాటు ప్రిన్సిపాల్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఫిబ్రవరి 8న మత్స్య మహిళా జాతీయ సదస్సు



మత్స్యకార్మిక సంఘం సన్నాహక సమావేశంలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఫిబ్రవరి 8న హైదరాబాద్ నగరంలో మత్స్య మహిళా జాతీయ సదసుస నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోరెంకల నర్సింహ, లెల్లెల బాలకృష్ణ తెలిపారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ సదస్సుకు సంబంధించిన సన్నాహక సమావేశంలో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడిగా తెలంగాణ మత్స్యశాఖ పారిశ్రామిక సహకార సంఘాల సమైఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్, అధ్యక్షులుగా కొప్పు పద్మ, కార్యనిర్వాహక అధ్యక్షులుగా బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, గౌరవ సలహాదారులుగా ఎమ్మెల్యే ముఠాగోపాల్‌తో పాటు సభ్యులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశంలో లక్షలాది మంది మత్స్య మహిళలు చేపలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారని వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. అనంతరం సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

పద్మశాలి సంఘం కేలండర్ ఆవిష్కరణ

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గ పద్మశాలి సంఘం రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఓల్డ్ ఎమ్మెల్యే క్వాటర్స్‌లో ఎమ్మెల్సీ ఎల్.రమణ, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మైనింగ్, మినరల్ కార్పొరేషన్ చైర్మన్ ఈ.అనిల్‌కుమార్ తదితరులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు కత్తుల సుదర్శన్, ముషీరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు అతినగరం సుదేశ్, గణేష్ టెంపుల్ మాజీ చైర్మన్ ఎస్.ఎస్.జయరాజు, దశరథం, బొడ్డు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడి విద్యార్థులకు వైద్య పరీక్షలు

చిక్కడపల్లి: అక్షర సంస్థ, జననీ ఫౌండేషన్ సహకారంతో జవహర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్, బీజేపీ సీనియర్ నాయకుడు వినయ్‌కుమార్, జననీ ఫౌండేషన్ అధ్యక్షుడు రాచకొండ మల్లేష్, ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్ మేడే దేవదాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో వైద్య సేవ కార్యక్రమాలతో పాటు విద్య, క్రీడా కార్యక్రమాలను ప్రోత్సహించాలన్నారు. సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థలను ఆమె అభినందించారు. అక్షర సంస్థ వలంటీర్లు స్పందన్ రెడ్డి, దంత వైద్యులు డాక్టర్ ఎల్. ఉషారాణి, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ చంద్రశేఖర్‌మిశ్రా, న్యాయవాది సంగ్రస్ భార్గవ్, గాయిత్రి, తరుష్, జనీషా, శరణ్య అతని బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్షలను నిర్వహిస్తున్న డాక్టర్ ఉషారాణి చిత్రంలో కార్పొరేటర్ పావని

నిరుపేద ఆడబిడ్డల వివాహానికి కల్యాణలక్ష్మి వరం



కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్లు జి.రచనశ్రీ, సుప్రియ, తహసీల్దార్ కె.రాణాప్రతాప్‌సింగ్

కవాడిగూడ: నిరుపేద ఆడబిడ్డల వివాహానికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఎంతగానో దోహదపడుతున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని 77కల్యాణలక్ష్మి, 120 షాదీ ముబారక్ చెక్కులు మొత్తం ఒక కోటి 97లక్షల 22వేల 800 వందల చెక్కులను శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ,ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్, ముషీరాబాద్ తహసీల్దార్ కె. రాణా ప్రతాప్ సింగ్‌తో కలిసి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారులందరూ కల్యాణలక్ష్మి,షాదీముబారక్ పథకాలకు దరఖాస్తు చేసుకొని లబ్ధిపొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్, బీఆర్‌ఎస్ నేతలు ముఠా జైసింహ, బీజేపీ నేతలు జి.వెంకటేష్, నవీన్‌గౌడ్, దిలీప్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. బాలకృష్ణారెడ్డి

అంబర్‌పేట: బాలికలు ఉన్నత చదువుల్లో రాణించి మేరుగైన సమాజం కోసం పాటుపడాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. వి. బాలకృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం నారాయణగూడలోని రెడ్డి మహిళ కళాశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. విద్యార్థినులకు ఓయూ ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొఫెసర్ శశికాంత్‌తో కలిసి పట్టాలు ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. బాలికలు విద్యా, ఉపాధి రంగాల్లో వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థికి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, ప్రిన్సిపల్ అచ్యుతాదేవి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించండి



కల్లుగీత కార్మిక సంఘం నూతన కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న బాలరాజుగౌడ్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజుగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో కల్లుగీత కార్మిక సంఘం నూతన కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలరాజు గౌడ్ మాట్లాడుతూ... వృత్తిలో మరణించిన వారి కుటుంబాలకు వికలాంగులైన వారికి ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియో సంవత్సరం నుంచి ఇవ్వాలన్నారు. కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ మాట్లాడుతూ... ఎన్నికల ముందు గీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. కల్లుగీత వృత్తిని ఆధునీకరించి ఉపాధిని పెంపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిలి వెంకన్నగౌడ్ గౌడ జనహక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎలికట్టే విజయకుమార్‌గౌడ్, ఉపాధ్యక్షులు వెంకటనర్సయ్య, అయిలేస్ గౌడ్, వెంకటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కో ముగ్గు.. ఒక్కో తీరు

'ప్రతి ముగ్గుకు ఒక కథ ఉంటుంది'







ముత్యాల ముగ్గు ధనుర్మాసానికి ప్రతీక... పన్నెండు చుక్కల ముగ్గు వైకుంఠ ద్వారాలకు సూచిక.. గుమ్మడికాయ ముగ్గు నెలగంటు వేయాలని చెప్పే వీచిక.. రథం ముగ్గు సూరీడికి స్వాగత గీతిక.. ఇలా ఒక్కో ముగ్గుకు ఒక్కో ముచ్చట ఉంటుంది. రంగవల్లులు కేవలం సరదా కోసం మాత్రమే కాదు. మన సంప్రదాయం కూడా. ధనుర్మాసం ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని శుక్రవారం నల్లకుంటలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో విద్యార్థులకు రంగోలి పోటీలు నిర్వహించారు. ఇందులో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు ముగ్గులు వేశారు.

- నల్లకుంట